

✷ అప్పుడే తెల్లవారిందే!
ఇవేళ తారీకెంత చెప్మా!

అబ్బా ఇంకా 11 రోజులుందే జీతాలు రావడానికి, ఎలా గడపాలి, టూత్‌పేస్ట్ లేదు, ఎలా ?

రూమ్మేటు తొందరగా ఫ్యాక్టరీకి పోతే బావుండు.

అతను వెళ్ళేవరకు నిద్రిస్తున్నట్లు నటన.

పోయిం తరువాత, అతని టూత్‌పేస్ట్ అవహరణ.

"వసంత"

ఆకలవుతుంది, రాత్రి కూడా సరిగ్గా భోంచేయలేదు. సాంబారులో ఉప్పెక్కువ వేశాడు వెధవ. ఎక్కువ తినలేరనో ఏమో!

అందులో బాయిల్డు రైస్, కడుపునొప్పి వచ్చినట్లయింది. అందుకనే కొంచెం తిన్నా.

ఆకలవుతుంది యిప్పుడెలా ?

జేబులో చిల్లర మొత్తం 90 పైస లుంది.

జీతా లింకా 11 రోజుల పైనే,

ఓహో ఈ వేళ సోమవారం కదూ!

హిస్టరీ, పొలిటిక్స్ బుక్స్ తీసికెళ్లి రూబీ కివ్వాలి. పాపం, పూర్‌గర్ల్, పుస్తకాల్లేకుండానే బి. ఏ. చేస్తుంది. రూమ్‌నుండి వాళ్ల హాస్టల్‌కి 70 పైసలు ఛార్జీ అవుతుందే, ఎలా ?

సరే ఏమైతే అయ్యింది, ముందు ప్రస్తుతం ఆకలి. క్రింద, నాయర్ టీ బంకులో, రెండు సాల్ట్ బిస్కట్లు, ఒక సింగిల్ టీ మొత్తం 20 పైసలు.

నిన్న మిగిలి, ప్యాంట్‌లో నలిగిన పనమా సిగరెట్.

అబ్బా సమస్య తీరింది, కొంచెం.

డ్రెస్ చేసుకుని, వర్క్‌షాప్ ప్రవేశం.

గురుద్యోగులకు నమస్కారాలు పెడ్తూ,

చిరుద్యోగులనుండి స్వీకరిస్తూ.

అబ్బా! అప్పుడే పని ప్రారంభం.

రణగొణ ధ్వని.

పూర్వజన్మలో అతి ఘోరమైన పాపం చేసుండాలి.

చెవులు బద్దలైపోతున్నాయి.

8—30, 'సార్! కాఫీ తాగరా ?'

బాగా తెలిసిన ఓ చిరుద్యోగి ఆఫర్,

'అబ్బే, ఒంట్లో బాగోలేదు.' చిన్నసైజు అబద్దం,

10-30, అబ్బా! అప్పుడే ఆకలవుతుందే !

ఎలా? వాడేమో, (అంటే పెరియస్వామి) 11—30 దాక భోజనం పెట్టడే?

'సరే, ఏం చెయ్యాలి, 11–30 వరకు వా పళ్ళరసం నేనే తాగాలి. ఇప్పుడే వెళితే, చీప్‌గా ఉంటుంది.

11–45 కి పెరియస్వామి మెస్సులో.

'సార్ ! అమ్లెట్ వెయ్యమంటారా ? లేక కోడి కూర తీసుకురమ్మంటారా ?'

'అబ్బే ఏం వద్దు.'

'తినండి సార్, ఈ వేళ బాగున్నాయి.' (వేశ్య ప్రవృత్తి).

సాయంకాలం. 4—30 గం. కు గాని ట్రైన్ లేదు.

స్టేషన్ లాడ్జీనుండి, 1 మైలుదూరం.

అక్కడ బండి ఎక్కితే, వెళ్ళవలసిన దూరంలో నగం దూరం పోవచ్చు.

అక్కడనుండి బస్సెక్కితే 15 పైసలే, బాగానే వుంది మంచి ఐడియా.

మరి బండి టిక్కెట్టో.

ఆ ఫర్వాలేదు, రైల్వే సేవకుడినేగా.

మధ్యాహ్నం, రెండోపూట ఎగ్గొట్టాలి.

3—30 వరకు నిద్ర,

వెధవది చాపలోకూడా నల్లులే,

గాలి, వెలుతురు అనేవి నోచుకోలేదు.

3—40 స్నానం చేసి, రూమ్మేటు కొబ్బరినూనె రాసి, నున్నగా దువ్వి, డ్రెస్ చేసుకునేసరికి, 4—10.

అబ్బా అప్పుడే, 4—10, అయ్యిందే.

వాచ్ లేకపోతే, ఇంతే గొడవ,

అడ్డమైనవాడిని, 'మణి ఎన్న సార్ ?' అని అడగాలి.

వచ్చే నెల తప్పక కొనాలి.

ఆ! ఆ, బతుక్కి కొంటం కూడాను.

డ్రెస్ మాత్రం, ఫస్ట్‌క్లాస్.

అతి ప్రియమైందీను, అఫ్‌కోర్స్, ఔరిలీన్ చొక్కా, రాజాగాడి ప్రెజెంటేషన్ అనబడే ధర్మం.

అరెరె, అప్పుడే, 4—25 అయ్యిందే.

అబ్బే బండి అందదు.

ఫర్వాలేదు, నెక్స్టు ట్రైన్ 5—30, సైన్‌బోర్డు.

అప్పటివరకు, ప్లాట్‌ఫారమ్ సర్వే చెయ్యొచ్చు.

ట్రైన్ వచ్చేసింది.

అబ్బా ఇంత రష్‌గా ఉందేం ?

కాలు మోపేంత స్థలం. ఫుట్‌బోర్డులో, రాడ్ దొరికింది ఫర్లేదు.

గాలికి తల చెరిగిపోతుందేమో !

వెళ్ళవలసిన స్టేషన్ వచ్చేసింది.

స్వంత యిల్లు అయినట్టుగా ఠీవిగా బైటికి నడక.

బస్సులో, పదునంజి పైసా టిక్కెట్టు. (పదిహేను పైసాలు).

యూనివర్సిటీ వచ్చేసింది.

అరమైలేగా, బీచ్‌గాలుల్ని పీల్చుకొంటూ, హాయిగా నడక.

ఒక సిగరెట్టు ఉంటే బావుండు.

అబ్బే! సిగరెట్టు 8 పైసలు.

అబ్బే లాభం లేదు, కోరికని వాయిదా వేసుకోవాలి.

ఛార్జీకి తక్కువైతే ? మళ్ళీ నడక తప్పదు.

వద్దు, సిగరెట్ లేకుంటే ఏం ఫరవా లేదు. పై పెచ్చు ఆరోగ్యం.

గేటు దగ్గరే, రూబీ వెయిట్ చేస్తుంది.

కళ్ళలో మెరుపు. సిగ్గు.

'అటువేపు నడుద్దామా ?'

బీచ్‌లో, టీ బండి.

'ఏమైనా కావాలా ? బిస్కట్లు, టీ ?' (డాంభీకం).

'అబ్బే ఏం వద్దు.' రూబీ మొహమాటం.

పైసా ఖర్చు లేకుండా గుడ్‌విల్ సంపాదించటం.

'ఏమైనా హెల్ప్, ఫైనాన్షియల్ గాని లేక అదర్ వైజ్, నన్ను అడిగేందుకు సందేహించకండి.'

(ఆ పిల్ల బహు సిగ్గుపరురాలు, అడగదు).

'అబ్బే వద్దండి. ఏమవసరంలేదు.'

ట్రైయింగ్ టు క్రియేట్ హై యింప్రషన్.

'మళ్ళీ ఎప్పుడొస్తారు?' ఆశగా అడగటం,

'ఆదివార మొస్తాను.'

'శెలవ్, గుడ్‌బై.'

వో టీ తాగితే బావుండు.

ఫర్లేదు, 50 పైసలు బిళ్ళ + 5 పైసలు.

ఉన్నాయిగా!

ఇటు పైకి నడిచి బస్‌స్టాప్ దగ్గరకెళ్తే,

అక్కడో చిన్న టీ బంకు ఉండాలి.

ఫర్లేదు, ఉంది, ఛా ప్లాట్‌ఫారం టీ,

పోనీలెదు , ఎవరు చూడొచ్చారు.

జనతా టీ స్టాల్,

'ఒరు సింగిల్ టీ కుడప్పా!' (ఒక సింగిల్ టీ ఇవ్వవయ్యా),

కాకతాళీయంగా, జేబులో చెయ్యి,

షాక్, 50 పైసలు కన్పించదేం ?

రెండు జేబులు, బ్యాక్ ప్యాకెట్టు,

అబ్బే లేదేం, 5 పైసలుంది.

వెంటనే, 'టీ వేండాం,' (టీ వద్దు).
దూరంగా వచ్చి.
అబ్బా ఎంత వెతికినా కన్పించదేం ?
వో దేవా! యిప్పుడేనా ఈ శోధనలన్నీ.
పెద్ద ఇడియట్‌ని.
ఉన్న డబ్బులే అంత మాత్రం.
అందులోనే, అశ్రద్ధ. అజాగ్రత్త.
రియల్ ఇడియట్‌ని.
అయ్యో! ఎలా, ఇక్కడనుండి సెంట్రల్ వరకు నడవాలే.
అక్కడైనా, బండి ఉంటుందో ఉండదో?
ఎలా, చూసి చూసి యిప్పుడే పోవాలా ?
ఇంకేముంది, చూసేందుకు.
కాళ్ళకు బుద్ధి చెప్పాలి.
షార్ట్ కట్ ఏమైనా ఉందేమో ?
అబ్బే ఎంత షార్ట్‌కట్టు అయినా 3 మైళ్ళకు పైనే.
అయినా ఏం చెయ్యాలి, తప్పదు.
స్టార్ట్ మార్చింగ్,
లెఫ్ట్, రైట్, లెఫ్ట్‌రైట్.
కాలేజీ విద్యార్థినులు.
సీతాకోక చిలకల్లా,
ఎంత అందంగా ఉన్నారు.
అబ్బా వాళ్ళ ముఖాల్లో ఎంత ఆనందం, సంతోషం,
ఎక్కడిదో ? ఎందుకో ?
ప్చ్ ప్చ్, నేను కాలేజీ చదివే రోజుల్లో

## చిరుద్యోగి ...

యింతకన్నా ఆనందంగా సంతోషంగా ఉండే వాడినేమో ?
తెలీదు, ఎవ్వరినైనా అడిగి తెలుసుకోవాలి.
నే కూడా వాళ్ళలో ఒకడినైతే,
ఇఫ్ ఐ వర్ టు బి వన్ లైక్ దెమ్ ?
అందుకే కాబోలు
ఇఫ్ ఐ వర్ ఎ చైల్డ్ ఎగైన్.
ఎవరన్నారు ? కీట్స్ బ్రౌనింగ్గా ?
ఎవరోలే, బ్రౌనింగో లేక రెడ్డింగో.
అవును. వచ్చే నెల ఖర్చులు జీతంపైగానే ఉన్నాయే ?
ఎలా ?
యింటికి పంపకపోతే ఎలాగోలాగు సర్దుకోవచ్చు,
అబ్బే అదేం కుదరదు.
మెట్రిక్ ఫెయిల్ అయిన చెల్లెలు,
రిటైర్ అయిన ఫాదర్.
బట్టలులేని చిన్నచెల్లెలు,
దైన్యం మూర్తీభవించిన మదర్,
సినిమాలోలా మనః పథకంలో.
మరి ఎలా ?
ఏమైనా, యింటికి పంపేది మాత్రం ఆపకూడదు.
మరి ?

పోని ఒక్క పూట భోజనం,
వో పూట టీ బన్ను తింటే ?
ఐడియా బాగనే ఉంది.
చూడాలి.
అబ్బా ఆలోచిస్తూనే, సెంట్రల్ వచ్చేసానే ?
'నెక్ట్స్ ట్రైన్ — ఎత్తినై మణిక్కు సార్.'
(నెక్ట్స్ ట్రైన్ ఎన్ని గంటలకు).
'తెరియాదప్పా,' (తెలియదయ్యా).
పిడినడిగేదేమిటి,
బోర్డులో, 9—45 గం.కు.
అబ్బా, ఇంకా 3 గం.ల సేపే.
ఆ ఫర్వాలెద్దు, యిప్పుడే వెళ్ళి చేసేదేముంది.
కాసేపు సెంట్రల్లో కలర్స్ చూడొచ్చు.
బొంబాయి పోయేదో, కేరళా పోయేదో,
అబ్బ జనం,
ఎక్కడికో యింత హడావిడి పరుగు.
అబ్బా! ఎంత అందంగా ఉందీవిడ.
అచ్చు మాలాసిన్హాలా ఉందే.
వాడెవడు, మొగుడు కాని కాదు కదా!
అబ్బ, వాడి బట్టతల ఎంచక్కా మెరుస్తుందో.
అదేవిటి, వాడలా ఆమె ప్రక్క కూర్చుంటున్నాడు.
అదేవిటి, బుజం మీద చెయ్యేసి మాట్లాడుతున్నాడు.
కాకి ముక్కుకు దొండ పండు అంటారే అట్లా వుంది.
అందుకనే కాబోలు 'మ్యారేజెస్ ఆర్ మేడ్‌యిన్ హెవెన్' అంటారు.
'అమ్మా తొందరగా రావే, సీటు పోతుంది.
వో తెలుగు కంఠం, మెయిల్లో.
ప్లాట్‌ఫారం మీద న్యూస్ వెండర్ని, అడిగే తెలుగు కంఠం, దానికి అరవ జవాబు.
బండి బయలుదేరేముందు ఇంగ్లీషు అరవ భాషల్లో ప్రకటనలు.
అంతా హడావిడి, ఎప్పటికప్పుడు ఈ హడావిడి, అంతులేని, ఈ హడావిడి,
ప్లాట్‌ఫారం మీద అమ్మే, కాఫీ, టీల కేకలు.
మెయిల్ బయలుదేరింది.
ఆఖరి నిమిషాల్లో వచ్చే ప్రయాణీకుల పరుగులు.



వాన వొచ్చి వెలసినట్లుయింది.

ప్రక్కన యింకో మెయిల్, బెంగుళూరిది కాబోలు.

సరే, కాళ్ళు నొస్తున్నాయి.

2 వ నెంబర్ ప్లాట్‌ఫారంమీద, కోయంబత్తూరు ప్యాసింజర్ వస్తుంది.

అక్కడే వో బెంచీమీద కూలబడి, రూబీ గురించి,

నవ్వినప్పుడు సొట్టపడే ఆమె బుగ్గల గురించి.

ఎలా అవుతుందో, ఆమె మామవాళ్ళు మాత్రం, ఇంకా చదివించా లంటున్నారట,

మరి యం.ఎ. చదివితే,

నా కందుతుందో, లేదో.

పోన్లే, నా కందకపోతేనేం, పై చదువులు చదివి, పైకొచ్చి సుఖపడుతుంది.

ఇంతలో, కోయంబత్తూరు ప్యాసింజర్, యింకా 5 నిముషాలలో బయలుదేరును. అరవం, యింగ్లీషు భాషల్లో ప్రకటనలు.

ఆఖరి పెట్టెలో ఖాళీ దొరికింది.

అహ! అదృష్టం, ఎదురుగా వో మళయాళీ కుటుంబం.

అక్కా, చెల్లెళ్ళో, అమ్మా, కూతుళ్ళో?

ఆ, ఎవరైతే నాకేంలే.

చక్కగా ఉందే, ఆ పిల్ల.

అదేవిటి, అలా చూస్తుంది నా వైపు.

నా వైపేనా, లేక నా వెనుక ఎవరైనా ఉన్నారో ?

ఆ ఫర్వాలేదు, నా వైపే,

బేసిన్‌బ్రిడ్జి వచ్చేసింది.

యింకో, 5 నిమిషాల్లో వస్తుంది చేరవలసిన గమ్యం.

తప్పదు, మళయాళీ సుందరి.

ఎవరికివారే, ఈ లోకం.

మళ్ళీ ఎప్పుడైనా, యెక్కడైనా, ఎలానైనా కలుసుకోగలిగితే, మళ్ళీ సాగిద్దాం, ఈ ప్రేమాయణం, ఈ కనుల సంభాషణ. వచ్చేసింది గమ్యం.

దిగాలి, తప్పదు.

దిగేవాళ్ళని దిగనీయకుండా, ఎక్కేవాళ్ళ హడావిడి.

ఎలాగో, సందు చేసుకుని దిగేశాను.

బండి బయలుదేరుతుంది.

ఆ పిల్ల పెద్ద కన్నుల్లో చిన్న నిరాశ. కంపార్టుమెంటు నన్ను దాటేంది.

అదేవిటి, చెయ్యి ఊపుతుంది.

ఫర్వాలేదు, నాకంటే తనే నయం.

బండి టెయిల్ లాంపు, దూరంలో ఎర్రని చుక్కలా.

గేటు దగ్గర, చేయి చాపిన టీ. సి.

అతన్ని గమనించకుండానే, తీవిగా బయటికి నడవడం.

పదయిందే, . యిప్పుడు లాడ్జి కెళ్ళి, భోజనాని కెళితేనా? చమట పట్టేంది. వో చిన్న స్నానంచేస్తే ?

ఆ ఫర్వాలేదు, లేద్దు అవతల టైమయిపోతుంది.

లేటయితే, పెరియాస్వామి మెస్సు మూసేస్తాడు.

10 నిమిషాలపాటు నడక,

వెత్తలపాక్కు (తమలపాకు) వేసుకుంటూ, పెరియస్వామి, వరండాలో, విలబడ్డాడు.

ఎన్న సార్? యివళా లేటు. ఎల్లా అయిపోచ్చి.

(ఏమిటి సార్? యింత లేటు, అంతా అయిపోయింది?)

ప్చ్, బేడ్ లక్,

కాళ్ళీడ్చుకుంటు, రూమ్ చేరి,

ఆకలవుతుందే ?

కాసిని మంచినీళ్ళు తాగి పడుకుంటే సరి.

ఈ మంచినీళ్ళు కూడా లేని నిర్భాగ్య సోదరులు, ఈ నా పవిత్ర భారతదేశంలో ఎంతమంది లేరు ?

ఛా! నీళ్ళు లేకపోవడమేమిటి.

రూమ్మేటు, శుభ్రంగా గురక తీస్తున్నాడు.

వెధవ, వీడికేం సమస్యలు, ప్రోబ్లెమ్సు లేవా ?

అదేం, దున్నపోతులా నిద్రపోతాడు.

ప్చ్ అదృష్టవంతుడు.

చాప, పక్క పరచుకొని, లుంగీ కట్టుకుని,

ఆలోచన,


ప్చ్, ఇంకా పదిరోజులుందే జీతం.

రేపెవడినైనా ఓ పది అప్పు అడగాలి.

జీతం రాగానే యిచ్చేయవచ్చు.

చూడాలి.

నిద్ర వస్తుంది. ●



దసరా బొమ్మల కొలువు (ఫొటో: శ్రీ ఎ. ఎల్. కె. ప్రసాద్)